

ఇన్‌ఛార్జి జెడ్‌పి సిఇఒగా డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒగా డిఆర్‌డిఎ పీడీ విజయరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత జెడ్‌పి సిఇఒ సుబ్బారావు వ్యక్తిగత కారణాల రీత్యా నెల రోజుల వరకు సెలవు పెట్టారు. దీంతో జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒగా డిఆర్‌డిఎ పీడీ విజయరాజుకు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విజయరాజు బుధవారం జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒగా బాధ్యతలు చేపట్టారు.


విజయరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

సాగునీటి పోరు వాయిదా

వాయిదా పడిన ఎన్నికల నోటిఫికేషన్
ప్రభుత్వం తీరుపై విమర్శలు వెల్లువ
అసహనం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతాంగం
అయోమయంలో సాగునీటి సంఘాల ఎన్నికలు




ప్రజాశక్తి - భీమవరం
సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆటంకం ఏర్పడింది. బుధవారం విడుదల చేయాల్సిన ఎన్నికల నోటిఫికేషన్ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జిల్లా రైతాంగం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే కూటమి సాగునీటి ఎన్నికల పట్ల వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో సాగునీటి సంఘాల ఎన్నికలు అయోమయంలో పడ్డాయి. ఎప్పుడు నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారడంతో జిల్లాలో సర్వత్రా చర్చ జరుగుతుంది.

సాగునీటి సంఘాల ఎన్నికలపై అయోమయం కొనసాగుతోంది. ఈ నెల 21న జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. 2016లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం గడువు పూర్తయినా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా అడ్డగోలుగా ముందుకు సాగింది. దీంతో కాలువల ఆధునికీకరణ వంటి పనులు పూర్తిగా పడకేసిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీంతో రైతులు ఎంతగానో హర్షించారు. ఎన్నికలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను పార్టీ కార్యక్రమంగా చూస్తున్న పరిస్థితి ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్టోబర్ 16న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించి 40 రోజుల్లో పూర్తి చేస్తామని స్వయంగా జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల ప్రకటించారు. కానీ జరగలేదు. ఆ తేదీన ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయలేదు. దీంతో రైతుల్లో తీవ్ర చర్చ కొనసాగింది. ఈనేపథ్యంలో అక్టోబర్ 21న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన తొలి నోటిఫికేషన్ విడుదల చేశారు. అక్టోబర్ 22 నుంచి 31వ తేదీ మధ్య ప్రాదేశిక నియోజకవర్గాలు ఖరారు చేస్తారని తెలిపారు. నవంబర్ ఒకటి నుంచి రెండో తేదీ మధ్య ఈ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలను పరిష్కరించి ప్రాదేశిక నియోజకవర్గాల జాబితా ప్రకటిస్తారన్నారు. నవంబర్ ఆరు నుంచి 11వ తేదీ మధ్య ఓటర్ల జాబితా సిద్ధం చేసి అభ్యంతరాల స్వీకరణ అనంతరం 13న తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. నవంబర్ 20వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్, 21వ తేదీన సాగునీటి సంఘాల ప్రతినిధులను ఎన్నుకునేందుకు సాధారణ సర్వసభ్య సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో మేజర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్స్ ప్రాదేశిక నియోజకవర్గాలు 92, మైనర్ 253, మీడియం 11, రెండు ప్రాజెక్టు కమిటీలు తేల్చారు. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్ యూజర్ అసోసియేషన్లు 98, మైనర్ 14, ప్రాజెక్టు కమిటీ ఒకటిగా తేల్చారు. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న తరుణంలో ఎన్నికలు వాయిదా వేయాలనుకోవడం ఏంటో ఏ ఒక్కరికీ అర్థంకాకుండా పోయింది. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ అంతా చట్టం పరిధిలోనే జరుగుతోంది. అటువంటప్పుడు ఒకసారి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక ఇష్టానుసారంగా వాయిదా వేయడం రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వాయిదా పడిన నోటిఫికేషన్
ఈ నెల 20వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. అయితే దీన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమది రైతు ప్రభుత్వమని వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తున్నామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం సాగునీటి ఎన్నికల నిర్వహణ పట్ల వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. అసలు సాగునీటి ఎన్నికలు జరుగుతాయా లేదా అని సర్వత్రా చర్చ సాగుతోంది.

ఆది నుంచి విమర్శలే..
సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతోంది. ఓటర్ల జాబితాపై రెవెన్యూ అధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది. ఈ నెల ఆరో తేదీ నుంచి 11వ తేదీ వరకూ ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని తొలి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 13వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉంది. అసలు ఆ ప్రక్రియ జరిగిందో లేదో కూడా తెలియని పరిస్థితి. ఓటర్ల జాబితా సిద్ధం చేసిన తర్వాత పంచాయతీల వద్ద జాబితా డిస్‌ప్లే చేసి అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ జరిగిందో లేదో కూడా తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తాం
ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి



సాగునీటి ఎన్నికలకు సంబంధించి ఈ నెల 20వ తేదీన విడుదల కావాల్సిన నోటిఫికేషన్ వాయిదా పడింది. ప్రభుత్వం ఆదేశానుసారం త్వరలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తాం. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తాం.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఒఎలు

వేతన బకాయిలు చెల్లించాలి


కలెక్టరేట్ వద్ద విఒఎల ధర్నా
రాజకీయ వేధింపులు ఆపాలి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్ రాయ్

ప్రజాశక్తి - భీమవరం
మూడేళ్ల కాలపరిమితి జిఒను తక్షణం రద్దుచేసి.. వేతన బకాయిలు చెల్లించాలని వెలుగు యానిమేటర్లు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి వెలుగు విఒఎలు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భీమవరం కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విఒఎలు పెద్ద ఎత్తున ధర్నాకు తరలివచ్చారు. కలెక్టరేట్ ఆవరణ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో మారుమ్రోగింది. ధర్నాను యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.నిర్మలాదేవి ప్రారంభించి మాట్లాడారు. జిఒను అమలు చేయబోమని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే కూటమి ప్రభుత్వం అమలు చేస్తామని మంత్రి ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. జనవరి 23న టిడిపి నాయకులు విజయవాడలో జరిగిన ధర్నా సందర్భంగా మా ప్రభుత్వ అధికారంలోకి వస్తే ఈ జిఒను బుట్ట దాఖలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాలపరిమితి జీవాన్ని రద్దు చేస్తామని హామీలు ఇచ్చారని దానికి భిన్నంగా మంత్రి ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం ప్రకటనను వెనక్కి తీసుకోవాలని, విఒఎలందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ చిరుద్యోగులు ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న వారిని రాజకీయ వేధింపుల పేరుతో తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ వేధింపుల పేరుతో తొలగించిన వారిని వెంటనే ఉద్యోగంలో తీసుకోవాలని డిమాండ్ చేశారు. కిందిస్థాయి ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు జి.లక్ష్మి, కె.రమ్యపార్వతి, కట్ట విజయ, సిహెచ్.దుర్గ భాగ్యలక్ష్మి, అనురాధ, టి.పద్మావతి, లలిత, సిఐటియు నాయకులు కోడే ప్రసాద్ పాల్గొన్నారు.

లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం

ప్రజాశక్తి - పాలకోడేరు
ఇప్పటివరకూ పూర్తయిన గృహాల్లో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రభుత్వ లేఅవుట్‌లో అన్ని వసతులు కల్పించేందుకు అధికార యంత్రాంగం దృష్టి సారించాలని ఆదేశించారు. విస్సాకోడేరు ఫోరు నంబరుపేట ప్రభుత్వ లేఅవుట్‌ను జిల్లా కలెక్టరు నాగరాణి ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రతి ఇంటినీ పరిశీలించి, నివాసం ఉంటున్న కాలనీ మహిళలతో జిల్లా కలెక్టరు మాట్లాడారు. కాలనీలో వర్షం వస్తే జలమయమవుతుందని, తాగునీరు, డ్రెయినేజీ, రహదారులు నిర్మించాలని మహిళలు కోరారు. జిల్లా కలెక్టరు స్పందిస్తూ దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని, ముందు ప్రాధాన్యతా క్రమంలో తాగునీటి సమస్యను పరిష్కరించి, స్వచ్ఛమైన తాగునీరు రెండుపూటలా పుష్కలంగా అందిస్తామని తెలిపారు. విస్సాకోడేరు ఫోరు నెంబరు పేట హౌసింగ్ లేఅవుట్‌లో మొత్తం 96 ప్లాట్లు మంజూరు కాగా, వాటిలో 39 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, గృహ ప్రవేశాలు చేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. రూఫ్ లెవెల్‌లో 9, ఎల్ఎల్‌లో 4, బిఎల్‌లో, బిబిఎల్‌లో 15 గృహ నిర్మాణాలు ఉన్నట్లు గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ జి.పిచ్చియ్య జిల్లా కలెక్టరుకు తెలిపారు. లేఅవుట్‌లో మిగిలి ఉన్న పనులు పూర్తి చేసేందుకు జల జీవన్ మిషన్ ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయాలని గ్రామ సర్పంచి బొల్ల శ్రీనివాసు జిల్లా కలెక్టరును కోరారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ లేఅవుట్‌లో తక్షణం తాగునీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారానికి రెండు పర్యాయాలు జిల్లాలో లేఅవుట్‌లను ఆకస్మిక తనిఖీలు చేపడతానన్నారు. పూర్తయిన గృహాలను, బిలో బేస్మెంటు, బేస్మెంటు గృహాలను డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాలన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లను మార్చి 31వ తేదీకి నాటికి పూర్తిచేసి నూరుశాతం లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్‌వి.ప్రసాద్, తహశీల్దార్ ఎన్.భారతి విజయలక్ష్మి, ఎంపిడిఒ వి.రెడ్డియ్య, గృహనిర్మాణ శాఖ డిఇ పి.శివరామరాజు, ఇఒపిఆర్‌డి ఎంవిఎస్.రామప్రసాద్, ఎఇలు బివి.నరసింహారావు, ఎన్.పార్వతి, ఎపిఎం ఎ.భారతి, విఆర్‌ఒలు పుల్లయ్య, భోగేశ్వరరావు, సచివాలయం, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

సౌర విద్యుత్ ఏర్పాటుతో నగదు ఆదా

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం
సౌర విద్యుత్ ఏర్పాటుతో ఎంతో నగదు ఆదా అవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. భీమవరం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలో కె.సూర్యనారాయణ రాజు ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ విద్యుత్‌ను బుధవారం జెసి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వినియోగదారుడు కె.సూర్యనారాయణ రాజుతో జెసి మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వాడకం వల్ల ఉపయోగం ఉందా, ఏర్పాటు చేయకముందు ఇప్పుడు విద్యుత్ బిల్లులో వ్యత్యాసం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. గతంలో విద్యుత్ బిల్లు ఎక్కువగా వచ్చేదని, సౌర విద్యుత్ వాడకం వల్ల విద్యుత్ వాడకం తగ్గడమే కాకుండా, బిల్లు ఖర్చు కూడా బాగా తగ్గిందని వినియోగదారుడు చెప్పడంతో జాయింట్ కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి దీని పెరిగేలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సౌర విద్యుత్ వినియోగానికి ముందుకు వచ్చే వారికి పిఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఇచ్చే రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఆలపాటి రఘునాథ బాబు, ఇఇ ఎన్.వెంకటేశ్వరరావు, ఎఇ పద్మశ్రీ ఉన్నారు.


వినియోగదారులతో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్‌రెడ్డి

శృంగవృక్షం-వేంద్ర రహదారి నిర్మించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పాలకోడేరు
శృంగవృక్షం-వేంద్ర రహదారిని నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ్య డిమాండ్ చేశారు. స్థానిక రహదారిలో రోడ్డును నిర్మించాలని బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్రియ్య మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు ఏడేళ్ల క్రితం వంతెన నిర్మాణ నిమిత్తం రోడ్డు వెడల్పు చేయడం జరిగిందని గుర్తు చేశారు. తర్వాత రెండు పర్యాయాలు మరమ్మతులు చేశారే తప్ప రోడ్డును మాత్రం నిర్మించలేదని విమర్శించారు. ఈ రోడ్డును నిర్మించడం ద్వారా శృంగవృక్షం గ్రామంతో పాటు వెంద్ర, కొండేపూడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొటికలపూడి శ్రీను, సిహెచ్.సుబ్బారావు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

గోపీమూర్తి విజయానికి కృషి చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు

ప్రజాశక్తి - మొగల్తూరు
ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజయానికి కృషి చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు ఉపాధ్యాయులను కోరారు. ఎన్నికల ప్రచారంలోని భాగంగా పాలకొల్లు, పోడూరు, నరసాపురం, మొగల్తూరు మండలాల్లో ఆయన పర్యటించి ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించారు. తమ మొదటి ప్రాధాన్యతా ఓటు గోపీమూర్తికి వేయాలని కోరారు. బుధవారం సాయంత్రం మొగల్తూరులోని పాతకాలవ సెంటర్ ప్రాంతంలో ఉన్న యుటిఎఫ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ విద్యా సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఆధ్వర్యంలో శాసనమండలిలో విశేష కృషి చేస్తున్నారన్నారు. పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థి గోపీమూర్తిని గెలుపుకు సహకరించాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు. ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, నాయకులు సిహెచ్.కృష్ణమోహన్, ఎన్.సువర్ణరాజు, కె.బ్రహ్మయ్య, సిహెచ్.సూర్యప్రకాష్, వై.శ్యాంబాబు, కె.గంగరాజు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నవకోటేశ్వరరావు

సిపిఎం పట్టణ కార్యదర్శిగా రామకృష్ణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం
పట్టణంలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు వెంటనే ఇవ్వాలని సిపిఎం పట్టణ మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం 8వ పట్టణ మహాసభ స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నిర్వహించారు. పట్టణంలో తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రెయినేజీ, దోమలు, కుక్కలు తదితర సమస్యలపై ఉద్యమించాలన్నారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని, జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడిపి కూటమి చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని, విద్యుత్ భారాలపై, స్మార్ట్ మీటర్ల బిగింపుపై పెద్దఎత్తున ఉద్యమించాలని, నిరంతరం స్థానిక ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని, భాగ్యలక్ష్మి పేటలో దేవదాయ భూముల్లో నివాసముంటున్న వారికి రెగ్యులైజేషన్ చేయాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం సిపిఎం తాడేపల్లిగూడెం పట్టణ నూతన కార్యదర్శిగా కరెడ్ల రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కె.నాగేశ్వరరావు, పుట్టా వేణుగోపాల చౌదరి, డివి.రావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, యాండ్రపు కృష్ణ, కరక వెంకటరావు, మడకా రాజు, జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషబాబు, వద్రి అప్పారావు, గొల్లు లక్ష్మి, ఎ.పూర్ణిమ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పట్టణ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.


ఎన్నికైన రామకృష్ణ

సాంకేతికతను విజ్ఞానాభివృద్ధికి వినియోగించుకోవాలి

గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో వక్తలు

ప్రజాశక్తి - తణుకు
సాంకేతిక విజ్ఞానాన్ని దుర్వినియోగం చేసుకోకుండా, విజ్ఞానాభివృద్ధికి వినియోగించుకోవాలని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యుఎల్.సుందరీభాయ్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశంలో ప్రిన్సిపల్ సుందరీభాయ్ మాట్లాడుతూ మానవీయ విలువలు నేర్చుకోవడం, తెలుసుకోవడం, ఆచరించడం, విద్యార్థి దశ నుండే అలవాటు చేసుకోవాలన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రధానం చేశారు. గ్రంథాలయాధికారి శ్రీహరనాథ్, ఉప గ్రంథాలయాధికారి బి.ప్రసన్నకుమారి, డి.స్రవంతి పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రామంలోని గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. వారోత్సవాల ప్రారంభం నుంచి ముగింపుదశ వరకు వివిధ దశల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, మ్యూజికల్ చైర్స్, కుండ కొట్టిడి వంటి ఆటల పోటీలను నిర్వహించగా ఆయా పోటీలలో విజేతలుగా నిలిచినటువంటి విద్యార్థులకు గ్రామ సర్పంచి దంగేటి రాజమణి, మాజీ సర్పంచి పెచ్చెట్టి సత్యనారాయణమ్మ, ఐద్వా జిల్లా కోశాధికారి సరిపల్లి జయప్రభ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

ఉండి: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు అని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఉండి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఉండిలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులు ఎంపిడిఒ రవీంద్ర, ఎస్ఐ నసీరుల్లా పాల్గొన్నారు. అనంతరం ఆటల పోటీలలో విజేతగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రధానం నిర్వహించారు. లయన్ ద్వారంపూడి నారాయణ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. గ్రంథాలయ అధికారి జెవి.కృష్ణమూర్తి, ముదునూరి మహంకాళిరాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర : గ్రంథాలయాలు విద్యార్థుల ఎదుగుదలకు మెట్లుగా ఉంటాయని స్థానిక మానవతా మండల అధ్యక్షులు, మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ పిడి కర్రి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. మానవత జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణ మూర్తి, విశ్రాంత తహశీల్దార్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, కమిటీ చైర్మన్ గుడిమెట్ల రామారెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : గ్రంథాలయంలో ఉన్న పాఠ్య పుస్తకాలను ప్రతి విద్యార్థి చదువుకుని విద్యలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉప విద్యాశాఖ అధికారి ఎన్.రవీంద్ర భారతి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో లభించే పుస్తకాలను చదవడం ద్వారా మంచి ఉద్యోగాలు వస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యాశాఖాధికారి రవీంద్ర భారతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

పాలకొల్లు : స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఎస్ఎన్ఎల్ ఎఇ డాక్టర్ కెసిహెచ్.పెద్దిరాజు హాజరయ్యారు. ముందుగా గ్రంథాలయ పితామహులైన ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ గ్రంథాలయ పుస్తక పఠనం ఏవిధంగా ఉపయోగపడుతుందనే విషయాలను విద్యార్థులకు తెలిపారు.

నరసాపురం : ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిసాయి. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పండా నాగేంద్ర త్రినాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్‌డిఒ దాసిరాజు విచ్చేశారు. తొలుతగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసిరాజు మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచి గ్రంథాలయాన్ని ఉపయోగించుకున్నానన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఇఒ పుష్పరాజ్యం, గ్రేడ్ వన్ లైబ్రరియన్ కుమారి పాల్గొన్నారు.

గణపవరం : గత వారంరోజులుగా జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా గణపవరం, పిప్పర గ్రంథాలయాలలో ఆటల పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం గ్రంథ పాలకురాలు ఎం.సుధారాణి, పిప్పర గ్రంథ పాలకులు పి.రంగారావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : స్థానిక ఆర్యవైశ్య వర్తక సంఘం(త్యాగరాజు భవనం)లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అన్ని వయస్సుల వారు పుస్తక పఠనం ద్వారా కొత్త కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. ప్రముఖ వక్తలు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి డాక్టర్ ఆర్ఎస్.కుమారేశ్వరన్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కెవి.సుబ్బరాజు పాల్గొన్నారు. పుస్తకాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన అమిరంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ముఖ్య అతిథి విచ్చేసి ప్రసంగించారు. రూ.53 వేలకుపైగా విలువైన 600కు పైగా పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అనురాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ సంధి సంజీవరెడ్డి, గ్రంథాలయ నిర్వాహకుడు పాల్గొన్నారు.



భీమవరం టౌన్ : మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

ఆర్‌టిసి కార్మికుల పనిభారం తగ్గించాలి

బస్ డిపో వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - తణుకు
ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం నాటి నుంచి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ జిల్లా నాయకులు కె.నూకరాజు ప్రభుత్వాన్ని విమర్శించారు. బుధవారం తణుకు బస్‌డిపో వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ని అమలు చేయడం లేదన్నారు. కార్మికుల పనిభారం తగ్గించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, రిటైర్డ్ అయిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు టివిఎస్ మూర్తి మాట్లాడుతూ డ్యామేజీ రికవరీ విధానాన్ని ఆపాలని, పెంచిన అలవెన్సును వెంటనే విడుదల చేయాలని, కొత్త వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎన్.శ్రీనివాసు, అధ్యక్షులు ఎ.ప్రసాద్, సిఐటియు నాయకులు కామన మునిస్వామి, ఆర్‌వి.దుర్గారావు, టివిఎస్ నారాయణ పాల్గొన్నారు.



బస్సు డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పాఠశాలల సమయం పెంపుపై పునరాలోచించాలి

భీమవరం : జెడ్‌పి ఉన్నత పాఠశాలల నిర్వహణ సమయాన్ని పెంపొందిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పునరాలోచించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎకెవి.రామభద్రం, పిఎస్.విజయరామరాజు కోరారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. సమయాన్ని పెంచుతూ ప్రభుత్వం ప్రతిపాదించి నెల్లూరు జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అమలు చేయాలని ఆదేశించారన్నారు. ఈ విధానాన్ని అమలు చేస్తే అనేక ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - గణపవరం

మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం బుధవారం ఏర్పాటైంది. గణపవరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి పంచాయతీ కార్యదర్శుల మండల గౌరవ అధ్యక్షులు డిఎస్ఆర్.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మండల నూతన అధ్యక్షులుగా ఎన్‌విఎస్.నాగేంద్ర కుమార్ పిప్పర కార్యదర్శి, ఉపాధ్యక్షులుగా సిహెచ్.చంటి బాబు వెంకట్రాజపురం కార్యదర్శి, అసోసియేట్ అధ్యక్షులుగా డి.రామాంజనేయులు సరిపల్లి కార్యదర్శి, ప్రధాన కార్యదర్శిగా ఎం.బుజ్జమ్మ సిహెచ్ అగ్రహారం కార్యదర్శి, ట్రెజరర్‌గా ఎ.భాస్కరరావు, గణపవరం 3 సచివాలయం కార్యదర్శితో నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - ఆచంట

బాల్య వివాహాలపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.సూర్య కుమారి అన్నారు. ఆచంట వేమవరం ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్య కుమారి మాట్లాడుతూ బాలికలు పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. బాలికలు ముఖ్యంగా సంపూర్ణ పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఇటువంటి రుగ్మతలు దరి చేరవని సూచించారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నెక్కంటి కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్తలు మైలే విజయలక్ష్మి, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

భీమవరం : విద్యార్థులు ప్రతి ఒక్కరూ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ పిడి బి.సుజాత రాణి సూచించారు. సిఎస్ఎన్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత రాణి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. ఆపదలో ఉన్న బాలలు, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ టికెవి లక్ష్మీకాంతం, లీగల్ అడ్వైజర్ పి.దుర్గ మాట్లాడుతూ సఖి వన్‌స్టాప్ సెంటర్ అందిస్తున్న సర్వీసెస్ గురించి బాలలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.నిర్మల, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎండి సలీం ఖాన్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మరుగుదొడ్ల ఆవశ్యకత నేటి తరంతో పాటు పాత తరం వారికి కూడా తెలియజేసే విధంగా అందరూ అవగాహన కల్పించాలని పెద్ద తాడేపల్లి గ్రామ సర్పంచి పోతుల అన్నారం సూచించారు. పెద్ద తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన వరల్డ్ టాయిలెట్స్ డే కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సోమేశ్వరరావు, ఎఇ రాజ మాట్లాడుతూ మరుగుదొడ్ల వినియోగంపై విద్యార్థులకు వివరించారు. అనంతరం మరుగుదొడ్ల వినియోగం చేసిన తరువాత చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని ఎంఈఆర్‌సి ఎం.రవి కిరణ్ తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ లాల్ బిబి మాట్లాడుతూ విద్యార్థులు మరుగుదొడ్ల వినియోగంపై కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో పాటు వాటి వల్ల ఉపయోగాలను కూడా వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తల్లాప్రగడ రవిచంద్, జెఎబిసి రఘు, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలకు రేషన్ సరుకులను సకాలంలో అందించాలని తహశీల్దార్ కె.రా కిషోర్ డీలర్లకు, ఇంటింటా రేషన్ సరుకులు అందించే వాహన నిర్వాహకులకు సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ భవనంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులకు సంబంధించి లబ్ధిదారులందరికి సరుకులు సరఫరా చేసేందుకు వీలుగా నాలుగు రోజుల్లో డీలలు తీసి అందించాలని అన్నారు. రేషన్ కార్డుదారులకు నూరు శాతం అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ సంధ్య, చౌక డిపో డీలర్లు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - తణుకు

తణుకు పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు నీటి డ్రెయినేజీ, ఔట్‌లెట్ డ్రెయినేజీలో ఉన్న సిల్ట్‌ను తీసే పనులను చేపట్టాలని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారని, వారి ఆదేశాల మేరకు పూడికతీత పనులు త్వరితగతిన జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ డ్రెయినేజీలో మురుగు నీరు నిల్వ ఉండకుండా, నీరు సక్రమంగా పోవుటకు, దోమలు ప్రబలకుండా ఉండేందుకు పూడికతీత(డీసిల్టింగ్) పనులు చేపట్టామన్నారు.

వెబ్ టెక్నాలజీపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక బిఆర్ఆర్ అండ్ జికెఆర్ చాంబర్స్ కళాశాలలో వెబ్ టెక్నాలజీపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా బివి.రాజు కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ విచ్చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిని సభకు పరిచయం చేస్తూ వెబ్ టెక్నాలజీ అనే ఒక వెబ్ పేజీలు డెవలప్ చేయడానికి, వెబ్‌సైట్ డెవలప్ చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ విద్యార్థులు వెబ్ డిజైనింగ్, జాబ్ పోస్ట్, అప్లికేషన్స్, యాప్స్ డిజైనింగ్ వంటి నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో మంచి ఉద్యోగాలలో స్థిరపడవచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇన్‌ఛార్జి రాము, మీన, రాంబాబు, వెంకట్ పాల్గొన్నారు.

రైతుల నుంచి ధాన్యం సేకరించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలని తహశీల్దార్ కె.రాజ కిషోర్ రైతు భరోసా కేంద్ర సిబ్బంది, సొసైటీ కార్యాలయ సిబ్బందికి సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్ధేశించిన ఏ రైస్ మిల్లులో అయినా ధాన్యం రైతులు విక్రయించుకోవచ్చని, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ అబ్దుల్ రహీమ్, డీటీ సంధ్య ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

103 కాసుల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి - పాలకొల్లు

పోడూరు మండలం కొమ్ము చిక్కాలలో ఇటీవల జరిగిన దొంగతనంలో కట్టా సుబ్బారావు అనే పాత నేరేస్తుడిని అరెస్ట్ చేసి ఆయన వద్ద నుంచి 103 కాసుల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు పాలకొల్లు రూరల్ సిఐ గుత్తుల శ్రీనివాసరావు చెప్పారు. పాలకొల్లు రూరల్ సిఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 13న కొమ్ము చిక్కాలలో జరిగిన దొంగతనం కేసులో సీసీ కెమెరాలు పరిశీలిస్తుండగా సుబ్బారావు ఆచూకీ తెలిసిందని, ఇతడు పాత నేరస్థుడే కావడంతో ఇతనిపై మరింత క్షుణ్ణంగా కేసులు పరిశీలించగా ఇటీవల జరిగిన జగన్నాథపురం పాలకొల్లు రూరల్ దొంగతనాలకు సంబంధించి ఇతడే నేరస్థుడని తెలిసిందన్నారు. ఇతనిపై మొత్తం 40 కేసులు ఉన్నాయని, 2 నెలల కిందట ఈయన బైలుపై విడుదలయ్యాక ఈ 3 నేరాలు చేసినట్లు సిఐ చెప్పారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఇటీవల పోడూరు మండలంలో 14 మోటార్ సైకిళ్లు, 50 బ్యాటరీలు పట్టుకున్నట్లు చెప్పారు. మోటర్ సైకిల్ దొంగతనాలు ఇటీవల ఎక్కువగా పెరిగాయని, వాహనదారులు చక్రాలకు రెండో తాళం ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలని సిఐ కోరారు. సుమారు రూ.1500-2 వేలు పెడితే జిపిఎస్ సిస్టంతో తాళం వస్తుందని, ఇది ఇంకా వాహనదారులకు సేఫ్టీ అన్నారు. దీని ద్వారా మీ వాహనాన్ని ఎవరు ముట్టుకున్నా వెంటనే ఇంజన్ ఆపే ఏర్పాటు ఉంటుందని, వాహనం దగ్గరికి మీరే వెళ్లి స్వాధీనం చేసుకోవచ్చు అన్నారు. పోలీసులపై భారం పెట్టకుండా వాహనాల వ్యక్తిగత జాగ్రత్తలు కూడా తీసుకోవాలని సిఐ కోరారు. ఎక్కువ రోజులు ఊరు వెళ్ళినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వడం గానీ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సిఐ కోరారు. ఇంకా పోడూరు ఎస్ఐ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అధ్వానంగా సామాజిక ఆరోగ్య కేంద్రం

దుర్వాసనతో రోగుల అవస్థలు
వైద్యులకు, రోగులకు సరిపోని గదులు


ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్ర పరిస్థితి దయనీయంగా ఉంది. చుట్టూ మురికి గుంటలు, చెత్తా చెదారం పేరుకుపోవడంతో అధ్వానంగా ఉండి దుర్వాసనతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రికి వెళ్లాలంటేనే భయమేస్తుందంటూ స్థానికులు వాపోతున్నారు. ఒకపక్క ఆసుపత్రి నిండా రోగులు, దానికి తోడు ప్రస్తుత పరిస్థితిలో అందరూ జ్వర పీడితులే. దీంతో అందరూ భయపడుతున్నారు. వీటికి తోడు ఆసుపత్రి చుట్టూ మురికిగుంటలతో దుర్వాసన వెదజల్లుతోంది. డాక్టర్లు కూర్చునేందుకు గదులు కూడా లేవు. సిహెచ్‌సి వైద్యులు మొత్తం 11 మంది వుంటే వారికి కూర్చోవడానికి, ప్రత్యేకంగా గదులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఒక్కొక్క గదిలో ఇద్దరు, ముగ్గురు డాక్టర్లు కూడా సర్దుకుని పేషెంట్లను పరీక్షించాలి. ఏ పేషెంట్ ఏ డాక్టర్ దగ్గరికి వెళ్లాలో గది లోపలికి వెళ్లాక కూడా తెలీదు, డాక్టర్‌ది అదే పరిస్థితి. ఏరోగి ఏ డాక్టర్‌కు అనేది తెలియదు.



పిహెచ్‌సి చుట్టూ పేరుకుపోయిన మురికి గుంటలు

ఇక వార్డుల్లో పరిస్థితి సరే సరే. ఎక్కడ పూర్తి వసతులు లేవు. పేషంట్ల కోసం వచ్చిన వాళ్లు బయట కూర్చునేందుకు చోటు లేదు. పేషంట్లు మంచం మీద కూర్చోవాలి. ఇవి ఇలా ఉంటే ఇక ఆసుపత్రి చుట్టూ వాతావరణం భయంకరంగా ఉంది. ఆసుపత్రికి తూర్పు దిక్కున ఆసుపత్రి బయట నుంచి వెలుపలకు వెళ్లే పంట నీటి కాలువ ఉంది. ఆ కాలువ ఆసుపత్రి లోపల భాగం నుంచి చూస్తే ఒకప్పుడు కళకళలాడుతూ ఉండేది. ప్రస్తుతం మురికి మాత్రమే ఇక్కడ కనిపిస్తోంది. కాలువను ఏనాడూ బాగు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుత ఆసుపత్రి భవనానికి పడమటి దిక్కున మరొక కొత్త ఆసుపత్రి భవనం కట్టారు. ఆ భవనం ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదు కానీ, కొత్త కొత్త రెండు భవనాల మధ్యన ఉన్న ఖాళీ స్థలం మాత్రం చిన్న మురికి కాలువగా తయారైంది. ఆ వాసన భరించలేక, అక్కడ కూర్చోలేక, రోగులు సైతం నానా అవస్థలు పడుతున్నారు. మరో అడుగు ముందుకేస్తే ఆసుపత్రికి ఉత్తర దిక్కున, కొత్త భవనానికి పక్కన రెండు చోట్ల కూడా మోకాలు లోతు గడ్డి ఎదిగి, కుళ్లి బీభత్సంగా తయారైంది. ఇక్కడ ఎవరూ బాగు చేయరు. ఆసపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని పలువురు వేడుకుంటున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హసీనా

చించినాడలో 'బేటీ బచావో-బేటీ పడావో'

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామంలో స్థానిక అంగన్వాడీ సెంటర్ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎండీ హసీన బాలల హక్కుల గురించి వివరించారు. అనంతరం చించినాడ ఎలిమెంట్రీ స్కూల్‌లో పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించి ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకుని మంచిగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలిమెంటరీ స్కూల్ టీచర్ శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్ భారతి, రజని, సహాయకులు పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతిపరుడు శివయ్య ఆకస్మిక మృతి

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు హెచ్‌పి గ్యాస్ కార్మికునిగా, గ్యాస్ కార్మిక సంఘ అధ్యక్షునిగా కార్మికులకు పలు సేవలు అందించిన సిపిఎం నాయకుడు కడలి శివయ్యకు బుధవారం పలువురు నివాళి అర్పించారు. ఆయన మృతి తీరని లోటు అని సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ అన్నారు. ఆయన సిపిఎం మార్టేరు శాఖ కార్యదర్శిగా పనిచేశారు. కామ్రేడ్ శివయ్య ఆకస్మిక మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేత గోపాలన్, జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు, ఎం.హనుమంతు జోహార్లు అర్పించి, ఆయన కుటుంబానికి సానుభూతి, ప్రగాఢ సంతాపం తెలిపారు.

ప్రతి ఆడబిడ్డకు రక్షణ కల్పిస్తాం : ఎస్‌పి


భీమవరం టౌన్ : ప్రతి ఆడబిడ్డకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, దీనిలో భాగంగానే మహిళా రక్షక్ టీమ్‌ను ప్రారంభిస్తున్నామని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. బుధవారం ఎస్‌పి కార్యాలయంలో మహిళా రక్షక్ టీంను జెండా ఊపి ఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మొట్టమొదటి ప్రాధాన్యత మహిళల భద్రత అనీ, మహిళలలో ఆత్మస్థైర్యం నింపాలన్న లక్ష్యంతో పశ్చిమగోదావరి జిల్లా పోలీస్ వారి ఆధ్వర్యంలో మహిళా రక్షక్ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు, ప్రతి మహిళా రక్షక్ వాహనం ద్వారా మహిళా పోలీస్ సిబ్బంది కళాశాలలు, పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్, పబ్లిక్ ప్లేసెస్‌లో గస్తీ తిరుగుతూ ఉంటారన్నారు. 112 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఏదైనా ఫిర్యాదు అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని అవసరమైన చర్యలు చేపడతారన్నారు. జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం

గ్రామ సర్పంచి జాన్

ప్రజాశక్తి - కాళ్ల

దాతల విరాళాలతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామ సర్పంచి గేదల జాన్ అన్నారు. బుధవారం కలవపూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని గ్రామ సర్పంచి జాన్ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మంతెన శివాజీ రాజు బస్ షెల్టర్‌ను మంతెన రామరాజు, మంతెన పెద నరసింహారాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. గ్రామంలో కావలసిన సమయంలో దాతల విరాళాలతో అంబేద్కర్ విగ్రహాన్ని సమకూర్చడం శుభపరిణామన్నారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దాట్ల వెంకటరామరాజు, కోనా జోసెఫ్, సోడదాసి గంగయ్య, చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన అంబేద్కర్ అభిమానులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యువదళం ప్రెసిడెంట్ బందెల కన్నయ్య రాజు, దాసి ఏసురత్నం, భలే దిలీప్ కుమార్, గంటా రాజేష్, నేతల యాకోబు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచి

జాతీయ లోక్ అదాలత్‌పై దృష్టి సారించాలి

నరసాపురం సివిల్ జడ్జి గంగరాజు



మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

నరసాపురం : డిసెంబర్ 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక దృష్టి సారించి, కక్షిదారులకు సమ న్యాయం అందించుటలో పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని నరసాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు సూచించారు. బుధవారం స్థానిక కోర్ట్ హాల్‌లో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ రాజీ చేయడానికి వీలుపడే కేసులను ముందుగా గుర్తించి ఇరు పార్టీలకు నోటీసులు ఇచ్చి, కౌన్సెలింగ్ ఇవ్వడం వల్ల కొన్ని కేసులను రాజీ చేయవచ్చునన్నారు. లోక్ అదాలత్ ప్రాముఖ్యతను, ముఖ్యోద్దేశం కక్షిదారులకు వివరించాలని, ఇప్పటికే గ్రామాలలో పారా లీగల్ వాలంటీర్స్ ద్వారా లోక్ అదాలత్ ప్రాముఖ్యతను తెలియజేయడం జరుగుతుందన్నారు. గతంలో కంటే ఎక్కువ కేసులు రాబోయే జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయవలసిందిగా పోలీస్ అధికారులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్, నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, పాలకొల్లు రూరల్ సిఐ జి.శ్రీనివాస్, ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎండి హమీద్, ఎస్ఐలు టి.వెంకట సురేష్, గుర్రయ్య, సిహెచ్.జయలక్ష్మి, వై.నాగలక్ష్మి పాల్గొన్నారు.

సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై అవగాహన

పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన కింద ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు రూఫ్ పైన సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేయడానికి సర్వే నిర్వహించి ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. సూర్య ఘర్ దరఖాస్తులకు నెడ్కాప్ త్వరగా ఆమోదించాలన్నారు. సోలార్ ప్రాజెక్టల ఏర్పాటుకు బహిరంగ ప్రదేశాల్లో 10 ఎకరాల వరకు స్థలం ఉండే ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. ప్రధానమంత్రి చేతుల మీదుగా పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ఫిబ్రవరి 13న ప్రారంభించడం జరిగిందన్నారు. కోటి కుటుంబాలకు సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటుకు, 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. గృహాలకు తగిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ కెపాసిటీ, సబ్సిడీ, దీని ద్వారా ప్రజలు రూ.78 వేలు వరకు సబ్సిడీ పొందవచ్చునని తెలిపారు. ఈ పథకం కింద గృహ యాజమానుల ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెల్స్‌ను అమర్చుకోవడానికి 40 శాతం వరకు సబ్సిడీని క్లెయిమ్ చేయవచ్చు అన్నారు. మోడల్ సోలార్ గ్రామం మార్గదర్శకాల ప్రకారం సోలార్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మార్గదర్శకాలు అనుసరించి 5 వేల జనాభా పైబడిన ఐదు గ్రామాలను ప్రాథమికంగా గుర్తించడం జరిగిందని, వాటిలో భీమవరం మండలం వెంప, పెంటపాడు మండలం అలంపురం, పాలకోడేరు మండలం పాలకోడేరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం అగర్తపాలెం, ఎస్.చిక్కాల ఉన్నాయన్నారు. ఎంపిక చేసిన గ్రామాలలో ఎక్కువ శాతం సోలార్ ఏర్పాటు చేసుకున్న గ్రామాన్ని గుర్తించి రూ.కోటి నిధులను పంచాయతీకి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, డిపిఒ పట్టణాల్లో అపార్ట్మెంట్ అసోసియేషన్స్‌తో, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రచారం కల్పించాలన్నారు. అనంతరం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార వాల్‌పోస్టర్‌ని, కరపత్రాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఆలపాటి రఘునాధ్ బాబు, జిల్లా నెట్ క్యాంప్ డెవలప్మెంట్ ఆఫీసర్ హరీష్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, డిపిఒ వి.అరుణశ్రీ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, డిఆర్‌డిఎ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి, ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్, విద్యుత్ శాఖ ఇఇ ఎన్.వెంకటేశ్వరరావు, ఎం.ఝాన్సీ, కె.నరసింహమూర్తి, కె.మధు కుమార్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి

సమిష్టి కృషితో దోమల నిర్మూలన

మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం : సమిష్టి కృషితో దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు సూచించారు. వెంకట రామన్న గూడెం ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని పట్టెంపాలెం గ్రామంలో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత ప్రదేశాలను నిలువరించుట ద్వారా దోమల ద్వారా సంభవించే వ్యాధులను అరికట్టుట సులభమని తెలిపారు. అనుమానిత జ్వరం కేసుల ప్రాథమిక పరీక్షల సదుపాయం అన్ని పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగపరచుకొనేటట్లు సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ ఆరోగ్య కార్యదర్శులు పద్మ, శాంతకుమారి, అంగన్వాడీ సిబ్బంది, ఆశాలు, ఆరోగ్యకార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు ఇ.కాంతారావు, తాతాజీ పాల్గొన్నారు.

చర్చి ఆక్రమణ

న్యాయం చేయాలని బాధితుల ఆవేదన

మొగల్తూరు : మొగల్తూరులోని పాలపర్తి వారి పేట క్రీస్తు లూధరణ సంఘ పాస్టర్ విషయంలో గతంలో జరిగిన గొడవలు పురస్కరించుకొని నాలుగు కుటుంబాలకు చెందిన సభ్యులు చర్చిన ఆక్రమించి 30 కుటుంబాల సభ్యులపై రౌడీయిజం, బెదిరింపులకు పాల్పడుతున్నారని సంఘ పెద్దలు వడ్లమూడి వెంకటేశ్వరరావు, మైలాబత్తుల సుభాష్, విజయ్ కుమార్, పాలపర్తి జయరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలపర్తి వారి పేటలో ఉన్న ఎస్‌సి కమిటీ హాల్‌లో 30 కుటుంబాలకు చెందిన సభ్యులు దైవ ప్రార్థనలు చేసుకునేందుకు ఆ నాలుగు కుటుంబాల సభ్యులతో, పలువురు పెద్దల సమక్షంలో అంగీకరించారని తెలిపారు. ప్రార్థన చేసుకుంటున్న కమ్యూనిటీ హాల్‌కు బెదిరింపులు, కోర్టు నోటీసుల పేరుతో 30 కుటుంబాల సభ్యులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చ్ (ఎఇఎల్‌సి) నాయకులకు తెలిపినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అదుపుతప్పి స్కూల్ బస్సు బోల్తా

క్లీనర్ దుర్మరణం

ప్రజాశక్తి - తణుకు

తణుకు జాతీయ రహదారి డీమార్ట్ సమీపంలో డాక్టర్ కెకెఆర్ గౌతమ్ స్కూల్ బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రమాదంలో స్టెప్పింగ్ స్టోన్ స్కూల్ బస్సు క్లీనర్ మేళం ప్రవీణ్(25) సంఘటనా స్థలంలో దుర్మరణం చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తణుకు నుంచి తూర్పుగోదావరి జిల్లా ఖండవల్లి, ముక్కామల గ్రామాల నుంచి విద్యార్థులను ఎక్కించుకోవడానికి వెళుతున్న కెకెఆర్ గౌతమి స్కూల్ బస్సు తణుకు డీమార్ట్ వద్దకు వచ్చేసరికి బస్సుకి ఎదురులో ఒక వ్యాన్ సడన్ బ్రేక్ వేయడంతో బస్సు డ్రైవర్ జి.రాంబాబు కూడా సడన్ బ్రేక్ వేయడంతో ప్రక్కనే ఉన్న డివైడర్‌ని గుద్ధడంతో బస్సు అదుపు తప్పి బోల్తాపడిందన్నారు. బోల్తా పడిన కెకెఆర్ గౌతమ్ స్కూల్ డ్రైవరు రాంబాబు, క్లీనర్ తాతారావులు చిన్నపాటి దెబ్బలతో సురక్షితంగా బయటపడ్డారు. చికిత్స నిమిత్తం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చేరారు. మృతుడు ప్రవీణ్‌ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థుల భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యమని ప్రముఖ ఇంజనీర్, సామాజిక కార్యకర్త(బెంగళూరు) డాక్టర్ సురేష్ నాయక్ సూచించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ఆచార్యులు డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో శ్రేష్ఠ క్లబ్ సహకారంతో ది రోల్ ఆఫ్ టెక్నోక్రాట్స్ ఇన్ వికసిత్ భారత్ అనే అంశంపై బుధవారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి సురేష్ నాయక్ మాట్లాడుతూ ఏ దేశ ఆర్థిక వ్యవస్థకైనా ఆయువు పట్టు యువతరమేనని, దేశ గతిని, స్థితిని మార్చే సత్తా నవతరానికే ఉందన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని, ఆ కలను సాకారం చేయడంలో విద్యార్థులు, సాంకేతిక నిపుణుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ వి.సందీప్, క్లబ్ కార్యదర్శి బి.గౌతమ్ పాల్గొన్నారు.

పిల్లల హక్కులపై అవగాహన

నరసాపురం: ప్రతి ఒక్కరూ పిల్లల హక్కులపై వాదన విన్పించేందుకు, పిల్లలకు మెరుగైన సమాజాన్ని నిర్మించేందుకు కంకణబద్ధులై స్ఫూర్తిదాయకమైన పాత్ర పోషించాల్సి ఉందని ప్యానల్ లాయర్లు కె.చిట్టి పద్మజ, కె.శిరీష అన్నారు. మండల న్యాయ సేవాధికార అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా స్టీమర్ రోడ్‌లో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పిల్లల హక్కులు, సంరక్షణ, సంక్షేమంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ పిల్లల హితం కోరి వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. మండల విద్యాధికారి పి.పుష్ప రాజ్యం, ప్రధానోపాధ్యాయులు జయదేవ్ పాల్గొన్నారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పామర్తి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పామర్తి వెంకటరామయ్యను ఎన్‌డిఎ ప్రభుత్వం నియమించింది. నూతనంగా నియమితులైన పామర్తి వెంకటరామయ్య గౌడ సంఘ నాయకులతో టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ పామర్తి వెంకటరామయ్య కౌన్సిలర్‌గా, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జిగా జిల్లా టిడిపిలో అనేక పదవులు నిర్వహించి, రాష్ట్ర బిసి నాయకునిగా గుర్తింపు పొందారని, వారికి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని కేటాయించడం సంతోషకరమన్నారు. టిడిపి నాయకులు పడమట సోమేశ్వరరావు, పూలురి పూర్ణచంద్రజోషి, వీరమల్లు వెంకటరమణ, బోల్ల రాంబాబు, దొంగ వెంకటేశ్వరరావు, మల్లుల పరమేశ్వరరావు, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

విజయవాడలోని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వైవి.రావు హాస్పటల్ ఆధ్వర్యంలో బుధవారం మార్టేరులోని దేవాంగుల కళ్యాణ మండపం ఆవరణలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 90 మందికి పరీక్షలు చేశారు. ఉదయం డాక్టర్ శ్రీదేవి బృందం పలువురికి గుండెనొప్పి సంబంధించి బిపి పరీక్షలు, ఇసిజి పరీక్షలు చేయగా 20 మందికి సంబంధిత ప్రాబ్లమ్స్ గ్రహించి, వారిని విజయవాడ ఆసుపత్రికి రిఫర్ చేశారు. 40 మందికి చిన్న సమస్యలు ఉండగా వారికి తగిన మందులు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, శ్రీగౌరీ శంకర్ దేవాంగ యువజన సేవా సంఘం అధ్యక్షులు అల్లాడ కుమారస్వామి, అమ్మవారు ఉత్సాహ కమిటీ ఉపాధ్యక్షులు వట్టం లక్ష్మణ్, పిచ్చుక మహేష్ వైద్య శిబిరాన్ని ప్రారంభించగా జిల్లా దేవాంగ సంఘం ప్రసార కార్యదర్శి రొబ్బి భాస్కరరావు, అల్లాడ రాంబాబు, కె.రాంబాబు, పూర్ణ వరప్రసాద్ వాలంటీర్లుగా సేవలు అందించారు.

జూనియర్ అసిస్టెంట్‌గా జగదీష్ కుమార్

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ జూనియర్ అసిస్టెంట్‌గా మండేలా జగదీష్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాసరెడ్డి మొగల్తూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారిగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడ జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ ఖాళీ అయింది. కాజాలోని గ్రూపు దేవాలయాల నుంచి డిప్యూటేషన్‌పై బండి ముత్యాలమ్మ ఆలయానికి జగదీష్ కుమార్ వచ్చారని ఆలయ కార్యనిర్వహణాధికారి మోక అరుణ్ కుమార్ తెలిపారు.

మావుళ్లమ్మ ఆలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలో వేంచేసియున్న శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయానికి ఐసిఎల్ సమస్త ఐఎస్ఓ సర్టిఫికెట్లను అందజేసింది. ఆలయంలో నాణ్యతా ప్రమాణాలు, అధికారుల పనితీరులను బుధవారం ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ సంస్థ పరిశీలించింది. ఈ సందర్భంగా ఆలయంలో సమస్త ప్రతినిధులు కె.సత్య సాయిబాబా, రామలక్ష్మిలు సర్టిఫికెట్‌ను ఆలయ సహాయ కమిషనర్ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, సమస్త ప్రతినిధులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

ఆదాయం రూ.13.53 లక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించామని ఆలయ కార్యనిర్వాహణాధికారి మోక అరుణ్ కుమార్ తెలిపారు. భీమవరం దేవాలయాల ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించామన్నారు. యాత్రికులు అమ్మవారికి గత 69 రోజులుగా కానుకలు, మొక్కుబడుల రూపంలో చెల్లించుకున్న హుండీ ఆదాయం రూ.13 లక్షల 53 వేల 486 నగదు సమకూరిందని అరుణ్ కుమార్ తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE PRL.CIVIL JUDGE(JUNIOR DIVISION):: GUNTUR

OS No:1092/ 2019

Between:
State Bank Of India,SMEC, Krishna Nagar,Guntur,Rep.by it's Chief Manager ....Plaintiff

And

Akhila Elegance. Guntur, rep. by its Prop. Kodati Rama Mohana Rao & Another ..... Defendants

To.
D-2: Sri Kodati Rama Mohana Rao, R/o.C/o.P.Mohan, Gopalunivari Street, Rail way Track Lane, C.P.J. Office Road, R.R. Pet, Eluru-34007, West Godavari Dist.

పై నెంబరు దావాలో 2వప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:03-12-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:03-12-2024

లంకా విజయకుమార్,
లంకా వంశీకృష్ణ,
వాది తరపు అడ్వకేట్స్,
రవీంద్ర నగర్, గుంటూరు.